క్లుప్తంగా

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయండి

కొత్తూరు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారి పెంజర్ల కూడలీ వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసేలా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, పాలకులు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కూడలీ వద్ద వెలుతురు లేని కారణంగా రాత్రి వేళల్లో రోడ్డు దాటుతున్న క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే జరిగిన ప్రమాదాల్లో పదుల సంఖ్యలో స్థానికులు మృతి చెందినట్లు వివరించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

'ఈసీ' ఉరకలు



ప్రవహిస్తున్న ఈసీవాగు

మొయినాబాద్ రూరల్: ఎగువన కురిసిన వర్షానికి ఈసీవాగు వరద నీటితో ప్రవహిస్తోంది. గురువారం రాత్రి వికారాబాద్, పరిగి, షాబాద్ ఆయా ప్రాంతాల్లో భారీగా కురిసిన వర్షానికి ఈసీవాగు శుక్రవారం మొయినాబాద్ మండలంలోని నక్కలపల్లి, చాకలిగూడ, కేతిరెడ్డిపల్లిలో వరద నీటితో ఉరకలేసింది. దీంతో చుట్టూ పక్కల గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

చేవెళ్ల: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చేవెళ్ల వివేకానంద కళాశాల చైర్మన్ డి. వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్‌లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకునేలా ఫలితాలు సాధించారని చెప్పారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా గ్రామీణ విద్యార్థులు రాణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

టీడీపీ చేవెళ్ల కోఆర్డినేటర్‌గా వెంకట్‌రెడ్డి

మొయినాబాద్: టీడీపీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా కొమ్మిడి వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నగరంలోని ఎన్టీఆర్ భవన్‌లో కొమ్మిడి వెంకట్‌రెడ్డికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి పూర్వ వైభవం తేవడానికి కృషి చేయాలన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే, కొమ్మిడి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సుభాష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జగదీష్‌రెడ్డి, మండల కోఆర్డినేటర్ యాదయ్యగౌడ్, లక్ష్మి ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జెడ్పీటీసీ శ్రీలత



మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీలత

కొత్తూరు: ప్రభుత్వం ఆయా పథకాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత అన్నారు. మండలంలోని మహిళ సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 20వ మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.5 లక్షల నుంచి 20 లక్షల వరకు మహిళాసంఘాలకు రుణాలు పెంచిందన్నారు. ఇచ్చిన రుణాలను సంఘంలోని మహిళలు సద్వినియోగం చేసుకునేందుకు పలు సంస్థల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించినట్లు వివరించారు. స్వయం ఉపాధితో మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని వివరించారు. తన నిధులతో కార్యాలయానికి రంగులు, ప్రధానరోడ్డును సీసీగా మార్చడం, ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, ఏపీడీ జంగారెడ్డి, డీపీఎంలు స్వర్ణలత, నిర్మల, ఏపీఎం కొండయ్య, డీఎంజీ గిరి, సీసీలు రాజప్ప, ఖలీల్, లక్ష్మమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వీర్యమవుతున్న 'ఆత్మ'

- సాగుపై రైతులకు అందని సూచనలు, సలహాలు
- యంత్రాల వినియోగంపై అవగాహన కరువు



కాశీంబౌలిలో వంకాయ పంటను సాగు చేసిన రైతు

మొయినాబాద్ రూరల్: వ్యవసాయ రంగంలో రైతులు సమగ్రాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకం నిర్వీర్యమవుతోంది. పథకం ద్వారా వ్యవసాయశాఖ రైతులను చైతన్యవంతం చేసేందుకు సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించాల్సి ఉన్నా ఎక్కడ కూడా కనిపించడం లేదు. యంత్రాలు కొనుగోలు చేసినప్పటికీ వాటిపై అవగాహన కల్పించే వారు కరువయ్యారని, సాగుపై సలహాలు సూచనలు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'ఆత్మ' ద్వారా ఇలా..

ఆత్మ పథకాన్ని 2014లో ప్రవేశపెట్టారు. అందుకు ప్రత్యేకమైన కమిటీలు ఏర్పాటు చేశారు. జిల్లా కమిటీల్లో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయ అధికారి కన్వీనర్‌గా ఉంటారు. గతంలో డివిజన్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. అధికారులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి యంత్రాలతో ప్రదర్శనలు నిర్వహించి రైతులకు సాంకేతికతపై అవగాహన కల్పించాలి. సమగ్ర వ్యవసాయ సహకారిగా తోడ్పడే పశుసంవర్ధక శాఖ, ఉద్యానవనశాఖ, చేపల పెంపకం వంటి శాఖల్లో సాంకేతికంగా వచ్చే అనేక మార్పులకు సంబంధించి అధికారులు వివరించాల్సి ఉంటుంది. దీనికి ప్రభుత్వం ఏటా రూ. లక్షల నిధులు విడుదల చేస్తోంది.

అవగాహన లేమి...

వ్యవసాయ రంగం అభివృద్ధి సాధించాలంటే రైతులు అధునాతన విజ్ఞానం కలిగి ఉండాలి. అందుకు ఆధునిక యంత్రాలు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలి. కానీ, వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో ఆత్మ పథకం ఉందన్న విషయమే జిల్లాలోని రైతులకు తెలియకుండా పోతుంది. గ్రామగ్రామాన తిరిగి రైతులకు సాంకేతికతపై అనేక విషయాలు తెలియజేయాల్సిన అధికారులు ఎక్కడో ఓసారి..ఏదో ఓ గ్రామంలో చప్పుడు కాకుండా పది మంది రైతులను కూర్చోబెట్టి సదస్సులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. ప్రభు త్వం నుంచి వచ్చిన నిధులు దిగమింగుతున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

చైతన్యం లేదు



వ్యవసాయంపై ఆత్మ అధికారులు గ్రామాల్లోకి వచ్చి రైతులను చైతన్యవంతం చేసేందుకు సదస్సులు, ప్రదర్శనలు ఏర్పాటు చేయడం లేదు. వారు ఎక్కడ వస్తున్నారో ఎవరికి తెలియదు.

– మల్లేష్‌యాదవ్ కాశీంబౌలి రైతు

యంత్రాలు మంజూరు చేయాలి



వ్యవసాయానికి సంబంధించి వివిధ రకాల యంత్ర పరికరాలను సబ్సిడీపై మంజూరు చేయాలి. వ్యవసాయ పరికరాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

– నిరంజన్‌గౌడ్ రైతు, నక్కలపల్లి

నిధులు కొరతే కారణం..

ఆత్మ పథకం ద్వారా గ్రామాల్లో రైతులకు ప్రస్తుతం అవగాహన సదస్సులు నిర్వహించడం లేదు. సిబ్బంది కొరత, నిధులు రాకపోవడంతో రైతులకు వ్యవసాయ క్షేత్రాలకు తీసుకువెళ్లి ఎలాంటి అవగాహనలు ప్రస్తుతం నిర్వహించడం లేదు.

– వెంకటేశ్వర్లు, ఆత్మ పీడీ

విభజన హామీల అమలులో విఫలం



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

చేవెళ్ల: ప్రధాని మోదీ వరంగల్‌కు వస్తున్న సందర్భంగా మోడీ గో బ్యాక్ అంటూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేశారు. నిరసనలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును అక్రమంగా అరెస్ట్ చేయడంతో పార్టీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో శుక్రవారం మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రామస్వామి మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. మోడీ 9 ఏళ్ల పాలనలో రాష్ట్రానికి చేసింది ఏమి లేదన్నారు. రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కూనంనేని సాంబశివరావును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన చేసే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని చెప్పారు. ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి సొంత పూచికత్తుపై వదిలేశారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఎండీ.మక్బుల్, నాయకులు శౌరీలు, బాబురావు, మల్లేష్, శ్రీను, మంజుల, విజయమ్మ, అనసూయ, స్వరూప, వినోద లలిత, సత్యమ్మ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సురేష్



కేశంపేట: ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నేతలు

కేశంపేట: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని, వర్గీకరణే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని ఆ సంఘం జిల్లా కోకన్వీనర్ గ్యార సురేష్ అన్నారు. ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. మందకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించామన్నారు. సబ్బండ వర్గాల సమస్యలపై ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీను, మల్లయ్య, యాదయ్య, కృష్ణయ్య, అర్జునయ్య, కేశవులు, నర్సింలు, రమేష్, మహేశ్ పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో రూరల్‌లో

షాద్‌నగర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ అనేక ఉద్యమాలను చేపడుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పెంటనోళ్ల నర్సింహ్మా అన్నారు. ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ్మా మాట్లాడుతూ..పాలకుల కుట్రలను ఛేదిస్తూ ఉద్యమ ద్రోహుల వెన్నుపోట్లు భరిస్తూ, స్వార్థపరులు కల్పించే అడ్డంకులను ఎదుర్కొంటూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం 29 ఏళ్లు సజీవంగా నిలబడిదంటే అది మందకృష్ణ మాదిగ సమర్థవంతమైన నాయకత్వమే కారణమని అన్నారు. ఎమ్మార్పీఎస్ పోరాటం మాదిగల కోసమే కాదని, అన్ని వర్గాల ప్రజలకోసం ఉద్యమాలను చేపడుతుందని అన్నా రు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనంతయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు బాల్‌రాజు, శ్రవణ్‌కుమార్, పాండు, దశరథ్, మహేందర్, సుమలత, సుజాత, సునీత, కవిత, శిరీష, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నియంతపాలనకు చరమగీతం తప్పదు



కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న శంకర్

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్

షాద్‌నగర్: రాష్ట్రంలో కొనసాగుతున్న నియంతపాలనకు చరమగీతం పాడుదామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్లలో మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ప్రజా పోరాటాలు, యువకుల త్యాగాలను చూసి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ జనం ఆకాంక్షలకు విరుద్ధంగా రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాగుతున్నా నియంత పాలకు చరమగీతం పాడాలని తెలిపారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, మహేశ్, హరిచంద్ర, శివ, ప్రధాన కార్యదర్శిగా పాత్లావత్ రమేష్‌లతో పాటుగా సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సింహ్మారెడ్డి, దర్శన్, ముబారక్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలను ఎండగట్టాలి

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను బొందపెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని గంట్లవెల్లిలో కాంగ్రెస్‌పార్టీ గ్రామ బీసీ సెల్, ఎస్సీ సెల్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబ పాలన చేస్తుంటే కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నియంత పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. దేశ సంపదను మోడీ, రాష్ట్ర సంపదను కేసీఆర్ దోచుకొంటున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నూతన కమిటీ అధ్యక్షుడిగా వజ్రలింగం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జంగయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలంయాదవ్, ప్రధాన కార్యదర్శిగా బాల్‌రాజ్, కార్యదర్శిగా రమణయ్య, కోశాధికారిగా శ్రీనివాస్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా యాదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంజయ్య, ఉపాధ్యక్షుడిగా మధు, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కార్యదర్శిగా పవన్‌కుమార్, కోశాధికారిగా నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధార్థ, ఎంపీటీసీ అరుణ, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బసప్ప, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సాయిలు, నాయకులు అబ్దుల్‌సమద్, బాల్‌రాజ్, నర్సింగ్‌రావు, ఎండీ. తోఫిక్, ఎండీ.జాకీర్, ఫసియోద్దీన్, సాదిక్‌అలీ, హకీబ్, ఖలీల్, ఎండి.గౌస్, సాహిక్, అనిల్, అంజి, వెంకటయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయండి

అంబేడ్కర్ సేన సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్



బాలునాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ పాఠశాలల బస్సులపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సేన సంఘం జిల్లా అధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంపీఐ బాలునాయక్‌ను సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ... షాద్‌నగర్ ప్రాంతంలో కొన్ని ప్రైవేట్ పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా రోడ్ల పై తిరుగుతున్నాయని అన్నారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో ఎక్కించుకొని ప్రయాణిస్తున్నారని తెలిపారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై ప్రయాణిస్తున్న బస్సులను రవాణాశాఖ అధికారులు వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం, డివిజన్ అధ్యక్షుడు జగన్, కృష్ణ, శివకుమార్ ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



సమ్మెలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు దేవేందర్, తదితరులు

సీఐటీయూ నేత దేవేందర్

మొయినాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండవ రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వం కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తుందని అసహనం వ్యక్తం చేశారు. జీపీలకు ఇతర ఉద్యోగుల తరహాలో అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. వేతనాల సవరణ చేసి వారి బతుకులకు వెలుగులు నింపాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, రా ములు, రత్నం, అంజనేయులు, మాణిక్యం పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

కొందుర్గు: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పంచాయితీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామాల్లో మురుగు కాల్వలు , రోడ్లు, మంచినీటి వసతి సక్రమంగా ఉన్నాయంటే కార్మికుల శ్రమే కారణమన్నారు. శ్రమ తగిన వేతనం రూ.19వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి గోపాల్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు నర్సింహ్మా, కార్మికులు యాదయ్య, జంగయ్య, యాదయ్య, రాములమ్మ, జంగమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

కేసు వద్దని చెప్పలేదు..

గ్రామ కార్యదర్శి జానకిరాం

నందిగామ: మండలంలోని నర్సప్పగూడ గ్రామ పంచాయతీ భూమిని ఆనుకొని పట్టా భూమి కల్గిన ఓ వ్యక్తి హద్దురాళ్లను తొలగించి, కబ్జాచేశాడని అతనిపై చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి జానకిరాం ఈ నెల 4వ తేదీన స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసి నాలుగు రోజులైనా నేటి వరకు ఎలాంటి కేసు నమోదు చేయక పోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామ కార్యదర్శిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. రూ.లక్షల భూమి కబ్జాకు గురైందని స్వయంగా గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై సీఐ సురేష్‌ను వివరణ కోరగా..నాలుగు రోజుల క్రితం నర్సప్పగూడ గ్రామ కార్యదర్శి పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్‌లో ఫిర్యాదు చేసి వెళ్లిపోయాడని, తర్వాత ఫోన్ చేసినా కూడా స్పందన లేదని, దీంతో శుక్రవారం స్టేషన్‌కు పిలిపించామని తెలిపారు. కేసు వద్దని, కబ్జా చేసిన వ్యక్తిని పిలిపించి మాట్లాడాలని రాసిచ్చాడని చెప్పారు. దీంతో జానకీరాం మాట్లాడుతూ.. ఫిర్యాదు చేసి నాలుగు రోజులు అవుతుందని, పోలీసులు పిలిస్తే వెళ్లానని, తహసీల్దార్‌కు , ఎంపీఓకు ఫిర్యాదు చేయకుండా తమకెందుకు ఫిర్యాదు చేశావని సీఐ తనపై ఆగ్రహం వ్యక్తం చేశాడని ఆరోపించారు. కబ్జా చేసిన వ్యక్తిని పిలిపించి మాట్లాడాలని సూచించాను. కేసు వద్దని చెప్పలేదు.

వర్షాలు కురవాలని పూజలు



ఇంటింటికీ తిరుగుతున్న మహిళలు

చేవెళ్ల: వర్షాలు కురవాలని గ్రామాల్లో మహిళలు కప్పకు పూజలు చేశారు. శుక్రవారం మండలంలోని ఆలూరులో మహిళలు కర్రకు కప్పను కట్టి ఇంటింటికీ తిరుగుతూ కప్పపై నీళ్లు పోస్తూ వానలు కురువాలంటూ వాన పాటలు పాడారు. వర్షాలు లేని సమయంలో వర్షాల కోసం గ్రామాల్లో దేవుళ్లకు పూజలు, కప్ప ఆటలు, కప్పపై నీళ్లు పోసి వేడుకోవడం ఆనవాయితీ. ఇలా చేస్తే వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురుస్తాయని ప్రజల నమ్మకం. ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు వరుణదేవుని కోసం ఎదురుచూస్తున్నారు.

శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



విరాళం అందజేస్తున్న అనంత్‌రెడ్డి

చేవెళ్ల: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ, సర్దార్ పాపన్న విగ్రహాల ఏర్పాటుకు ఆయా వర్గాల ప్రజలు కృషి చేస్తున్నారు. శుక్రవారం చేవెళ్లలోని శివాజీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు అఖిలపక్షం నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు చేవెళ్లలోని వెంకటేశ్వరస్వామి పుష్కరిణి వద్ద ఉన్న చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య విగ్రహాల పక్కనే ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అన్ని పార్టీల నాయకులు ఈ భూమి పూజలో పాల్గొన్నారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి తన వంతు సహాయంగా రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి సర్దార్ పాపన్న విగ్రహం, గౌడ సంఘం భవనానికి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్, ఎంపీటీసీ సున్నపు వసంతం, రాములు, నాయకులు ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మంగలి యాదగిరి, తిరుపతిరెడ్డి, యూత్ సభ్యులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: షాబాద్ మండలాన్ని జిల్లాలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంతారం, కుర్వగూడ, బోడంపహాడ్, అప్పారెడ్డిగూడ గ్రామాల్లో పల్లెపల్లెకు అవినాశ్‌రెడ్డి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మిగిలిపోయిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పెన్షన్లు, రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల అమలులో బీఆర్ఎస్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యాదమ్మ, సంధ్యారాణి, పూజిత, కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు వనిత, సరళ, సహకార సంఘం చైర్మన్ శేఖర్ రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, నాయకులు సురేష్‌గౌడ్, దర్శన్ పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి

టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

చేవెళ్ల: సమాజంలో సమూల మార్పులు తీసుకు వచ్చే శక్తి విద్యార్థులలో ఉంటుందని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్(టీఎస్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధలు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం టీఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. యువతి, యువ కులు సామాజిక సేవా కార్యక్రమాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని చెప్పారు. చెట్లు లేకపోతే భూమిపై ప్రాణకోటి జీవించడం కష్టమన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌యాదవ్, అధ్యాపకులు మహేశ్, శివకృష్ణ, మాధవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల సంబరాలు



బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా బయలుదేరిన అధ్యాపకులు, విద్యార్థినులు

మొయినాబాద్‌రూరల్: డప్పుల దరువులు, విద్యార్థులు, అధ్యాపకుల నృత్యాలతో బోనాల సంబరాలను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని అజీజ్‌నగర్ సమీపంలో గల చిలుకూరు బాలాజీ ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరరావు బారు, డైరెక్టర్లు పుల్ల రమేష్‌బాబు, ఎం.మధుసూదన్‌రెడ్డి, ఎం.నర్సింహ్మారెడ్డిల ఆధ్వర్యంలో అధ్యాపకురాలు లక్ష్మీకళ్యాణి విద్యార్థినులతో కలిసి బోనాలు నిర్వహించారు. కళాశాల తరగతి గదుల నుంచి ఆవరణ గుండా పక్కనే ఉన్న అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆషాఢమాసంలో జంట నగరాల్లో జరుగుతున్న బోనాల ఉత్సవాల్లో భాగంగా కళాశాలలో బోనాలు నిర్వహించడం ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తుందని ప్రిన్సిపాల్ చంద్రశేఖరరావు బారు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.